సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



కనకమ్మకు నీరాజనం

యలమంచిలి, కశింకోట పట్టణాల్లో మార్గశిర రెండో గురువారం కనకమహాలక్ష్మి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 8లో



తుమ్మ 'పాలన' సూపర్

సుపరిపాలన విభాగంలో అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. 8లో



ఏయూలో అమెరికన్ ఆచార్యులు

విశాఖ విద్య: ఏయూను అమెరికాలోని టెక్సాస్ ఏ-ఎం యూనివర్సిటీ ఆచార్యులు గురువారం సందర్శించారు.

- సూపర్-6 పేరుతో ప్రజలకు నయవంచన
- అన్నాక్యాంటీన్లు, సింగిల్ సిలిండర్, వెయ్యి పింఛను పెంపుతో సరి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వీర్యం
- పడకేసిన విద్య, వైద్యం, సంక్షేమ రంగాలు
- అడుగడుగునా జిల్లాను దగా చేసిన కూటమి సర్కారు

6 మాసాలు... మోసాలు...

కూటమి మాటలకెన్నో అర్థాలున్నాయి... నోటినిండా అబద్ధాలే ఉంటాయి. ఎండమావులెలా దప్పిక తీర్చవో.. చంద్రబాబు సర్కారు హామీలు కూడా అదే మాదిరిగా మారిపోయాయి. సూపర్‌సిక్స్ పేరుతో 'మాయ'ఫెస్టో తీసుకొచ్చి.. హామీల వర్షం కురిపించేసి జనం వేసిన ఓట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కూటమి... ప్రతి విషయంలోనూ ప్రజల నెత్తిన టోపీ పెడుతోంది. జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతోంది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. అన్నీ మోసాలే తప్ప.. ఏ ఒక్క వర్గాన్నీ హ్యాపీగా ఉంచిన రోజు ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. రైతులు, మహిళలు, చిరుద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, యువత, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, రియల్ వ్యాపారులు.. ఇలా.. ప్రతి ఒక్కరి జీవితాల్ని రోడ్డున పడేసింది.

సాక్షి, అనకాపల్లి :

ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన హామీలన్నీ తుంగలో తొక్కారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం వంటి హామీలన్నీ గాలికొదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని కూటమి సర్కారు ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది.

విద్యార్థులపై 'ఫీజు' భారం..



కూటమి ప్రభుత్వంలో పేదోడికి చదువు భారంగా మారింది. ఇంటర్ చదివి ఆపై ఉన్నత చదువులు అభ్యసించే ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ విద్యార్థులపై ఫీజుల భారం పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించడంతో పేద విద్యార్థులంతా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఉన్నత చదువుల కోసం చేరారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులపై ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో సగంలోనే చదువులు ఆగిపోవడంతో అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 1.2 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులపై ఫీజుల భారం పడింది.

ఏదీ.. తల్లికి వందనం



బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయమన్న చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో ఈ ఏడాది తల్లికి వందనం ఇవ్వలేమంటూ ప్రకటించారు. తల్లులంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. జిల్లాలో సుమారు 1,50,870 మంది తల్లులకు ప్రభుత్వం ఏటా రూ.15 వేల చొప్పున జమ చేసేది. ఇప్పుడు ఈ సాయం కోసం 2,18,190 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగులకు ఆశాభంగం?



2014లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసి, ఈ ఎన్నికల్లోనూ అదే హామీని ప్రధానంగా తీసుకొచ్చారు. ఈ పథకం పొందడానికి జిల్లాలోని 4,79,920 బీపీఎల్ కుటుంబాల్లో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

మహిళలకు ఏం సమాధానం చెబుతారు?



గత ప్రభుత్వంలో మహిళలకు చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పేరిట సాయం అందేది. ఏ విధమైన పింఛన్ రాని 18 ఏళ్లు దాటిన మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలో 5,47,888 మంది మహిళలున్నారు.

ఉచిత బస్సు ఉత్తమాటేనా...




జిల్లాలో 18 ఏళ్లు దాటిన మహిళలు 6,53,500 మంది... 5 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు 84,814 మంది. వీరందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. ఇంత వరకు దాని గురించి ప్రస్తావన లేదు.

ఒకటే సిలిండర్‌తో సరి..



ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఒక్కటే సిలిండర్ ప్రకటించారు. జిల్లాలో 5,17,081 గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులుగా గుర్తించారు. కానీ వీరిలో 3 లక్షల 60 వేల కనెక్షన్‌లకే ప్రభుత్వం సిలిండర్లు సరఫరా చేస్తుంది.

రైతు గొంతులో కాల కూటమి



- ఆర్నెల్ల కూటమి పాలనలో హామీలకు పాతర!
- అందని రూ.20వేల పెట్టుబడి సాయం
- ఉచిత పంటల బీమా ఎగవేత, రైతులపై ప్రీమియం భారం
- రైతు సేవా కేంద్రాలు నిర్వీర్యం... రాయితీ ఎరువులు, విత్తనాలకు మంగళం
- వ్యవసాయానికి కరెంటు వాత... 9 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేత
- దళారులు, మిల్లర్ల చేతుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ
- ఈ నయవంచనను నిరసిస్తూ రైతుకు అండగా వైఎస్సార్‌సీపీ
- నేడు రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ



మునగపాక మండలం అరబుపాలెం ఆర్బీకేలో యూరియా బస్తా పంపిణీ (ఫైల్)

ఖరీఫ్, రబీ సమయమేదైనా.. ఐదేళ్ల పాటు చిరునవ్వుల పంటలు పండించిన అన్నదాతలు.. ఇప్పుడు కన్నీటితో సావాసం చేస్తున్నారు. సకాలంలో ఎరువులు అందక.. బీమా ఉందన్న దీమా కూడా లేక.. పంట సాయం కూడా దూరమై.. చివరికి ధాన్యం కొనుగోళ్లలోనూ సర్కారు సహకారం లేకపోవడంతో.. రైతు బతుకు దైన్యంగా మారిపోయింది. రోడ్డున పడ్డ రైతన్నకు.. ప్రభుత్వంతో పోరాడే ఓపిక కూడా నశించిపోయింది. ఈ తరుణంలో అన్నదాతకు అండగా నిలిచేందుకు... రైతు గొంతుకై.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్‌సీపీ నడుం బిగించింది. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. శుక్రవారం ఉదయం.. 10 గంటలకు మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం రైతులతో కలిసి పార్టీ నేతలు, కార్యకర్తలు అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నారు.

– సాక్షి, అనకాపల్లి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా కింద జిల్లాలోని సుమారు 2,65,778 మంది రైతులు రూ.18,500 చొప్పున ఆర్థిక సాయం పొందేవారు. బాబు అధికారంలోకి వస్తే 'అన్నదాత సుఖీభవ' పేరుతో రూ.20 వేలు రైతులకు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఖరీఫ్ సీజన్ పూర్తయినా పెట్టుబడి సాయం అందివ్వకుండా దగా చేశారు. జిల్లాలో 2,65,778 మంది రైతులకు మొత్తంగా పెట్టుబడి సాయం కింద రూ.531.5 కోట్లు అందచేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం ఆ మాటే ఎత్తడం లేదు. ఈ ఖరీఫ్‌లో రైతుకు అన్నీ నష్టాలే చవి చూశాడు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో క్రాప్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్ పూర్తయినా పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పులపాలయ్యాడు. సకాలంలో సబ్సిడీ ఎరువులు, విత్తనాలు లేవు. దళారుల చేతిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పెట్టడంతో రైతులకు గిట్టుబాటు ధర కూడా లేదు.

ఉచిత బీమాకు ఎసరు...

అతివృష్టి వచ్చినా..అనావృష్టి నుంచి అన్నదాతను ఆదుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' పథకాన్ని అందించింది. రైతు పంటకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించింది. దీంతో విపత్తులకు భయపడకుండా రైతు పంటలు ధైర్యంగా పండించుకునేవాడు. కానీ కూటమి ప్రభుత్వం ఉచిత బీమాకు మంగళం పాడింది. ఈ ఏడాదిలో మొత్తం 1.80 ఎకరాల్లో ఖరీఫ్ సాగు వేశారు. వీటిలో 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగు వేశారు. వీటికి పంటల బీమా ప్రీమియం కింద రూ.8.82 కోట్లు,, మిగతా ఇతర పంటలకు రూ. కోటికి పైగా చెల్లించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఈ మొత్తం చెల్లించకపోవడంతో రైతులపై ప్రీమియం భారం రూ.9.46 కోట్లు పడింది.

పంట నష్టం..కంటి తుడుపు సాయం

ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో నాలుగు రోజుల పాటు భారీగా వర్షాలు కురిశాయి. అప్పుడు జిల్లా వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో వరి పంట, మరో వెయ్యి ఎకరాల్లో ఉద్యానవన, ఇతర పంటలు నీట మునిగాయి. అయితే వీటిలో 3200 ఎకరాలకే పంట నష్టం అందింది. దాదాపుగా 2,800 ఎకరాల్లో పంటకు బీమా సౌకర్యం లేదు.

ఉచిత విద్యుత్ నిలిపివేత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ అందించేది. జిల్లా పరిధిలో 29 వేల వ్యవసాయ ఉచిత విద్యుత్ సర్వీసులున్నాయి. ఇప్పుడు ఈ సర్వీసులన్నింటికీ నేడు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ నిలిపివేసింది.

ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం

అనకాపల్లి జిల్లాలో 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశారు. వీటిలో పౌరసరఫరాల శాఖ ద్వారా 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధం చేశారు. ఈ ఏడాది వర్షాల కారణంగా పంట కోతలు ఆలస్యంగా జరిగాయి. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సమయానికి 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది.



అన్నదాత... 'దుఃఖీభవ..'

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు

రైతు భరోసా	:	18,500 (ప్రతి ఏటా రూ.)
లబ్ధిదారులు	:	2,65,778
మొత్తం లబ్ధి	:	491 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	:	రూ.9.46 కోట్లు
ఉచిత విద్యుత్	:	రోజూ 9 గంటల పాటు (జిల్లాలో 29,000 వ్యవసాయ కనెక్షన్లు)

కూటమి ప్రభుత్వం హామీ

అన్నదాత సుఖీభవ	:	20,000 (ఏటా రూ.)
అర్హులైన లబ్ధిదారులు	:	2,65,778
అందాల్సిన లబ్ధి	:	రూ.531.5 కోట్లు
అందిన లబ్ధి	:	నిల్
పంటల బీమా చెల్లింపు	:	నిల్
ఉచిత విద్యుత్	:	నిల్

నాడు భరోసా.. నేడు దగా..



చంద్రబాబు ప్రభుత్వం రైతులను నిలువునా ముంచేసింది. గత ప్రభుత్వంలో రైతుకు అడుగడుగునా కొండంత భరోసా లభించింది. పెట్టుబడి సాయం నుంచి విత్తనాల పంపిణీ, పారదర్శకంగా విత్తనాల కొనుగోలు వరకు రైతుకు అండగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నీ కష్టాలే. సూపర్ సిక్స్ హామీలో ఒకటైన అన్నదాత సుఖీభవ నగదు వేయకపోవడంతో అప్పు చేసి ఖరీఫ్ సీజనులో పెట్టుబడి పెట్టాం. ఇప్పుడేమో తుపాను కారణంగా చేలన్నీ నేలవాలిపోయి ఉన్నాయి. కోత కోయలేని పరిస్థితిలో ఉన్నాం. ధాన్యం కొనుగోలు దళారులకు అప్పగించారు. ఇక రైతు కోలుకునే అవకాశమే లేదు.

– గొల్లు నానిబాబు, రైతు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

హామీలను విస్మరించారు



ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను చంద్రబాబు విస్మరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు అమలు చేయలేదు. మాజీ సీఎం జగన్ రైతు పక్షపాతిగా పాలన సాగించారు. ఈ ప్రభుత్వంలో రైతులకు ఒరిగిందేమీలేదు. పంట నష్టం పరిహారం కూడా అర్హులకు అందలేదు.

–బొద్దపు శ్రీరామమూర్తి, రైతు, ఒంపోలు, మునగపాక మండలం

జనవరి 10న అప్పన్న వైకుంఠద్వార దర్శనం

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వచ్చే నెల 10న సింహాచల శ్రీవరాహ లక్ష్మీనసింహస్వామి వైకుంఠద్వార దర్శనం ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సింహాచలం దేవస్థానం సెక్షన్ హెడ్‌లతో ఈవో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం ఉత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

రైతన్నకు అండగా వైఎస్సార్‌సీపీ

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దీనావస్థలో ఉన్న రైతులకు అండగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో అన్నదాతలకు దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం గోడపత్రికలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, మొలకెత్తే ధాన్యం కొనుగోలు చేయాలని, ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడికి సహాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, వాటిపై ప్రజలు ప్రశ్నించకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు తదితర నేతలు

పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మలసాల రమణారావు, మలసాల కుమార్‌రాజా,ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 80వ వార్డ ఇన్‌ఛార్జ్ కెఎం.నాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, రాష్ట్ర మాజీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పాల్గొన్నారు.

ఎన్నికల్లో అనర్హత వేటుకు కుయుక్తులు

- నీటితీరువా కట్టించుకోవద్దని వీఆర్వోలపై అధికార పార్టీ ఒత్తిళ్లు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు గొడిచర్ల రైతులు సిద్ధం



డీటీకి ఫిర్యాదు చేస్తున్న గొడిచర్ల రైతులు

నక్కపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిచే సత్తా లేకపోవడంతో ప్రత్యర్థులు పోటీ చేయకుండా కూటమి పార్టీల నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. తమకు ఎదురు తిరిగి పోటీ చేసే రైతుల భూములకు నీటితీరువా కట్టించుకోకుండా వీఆర్వోలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. తద్వారా పోటీలో అభ్యర్థులను అనర్హులను చేసి దొడ్డి దారిన గెలుపొందాలని ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఆధ్వర్యంలో గొడిచర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు నక్కపల్లి తహసీల్దార్ నర్సింహమూర్తికి గురువారం ఫిర్యాదు చేశారు. బాపిరాజు చెరువు, కొత్త చెరువుల ఆయకట్టు పరిధిలోని రెండు నీటి సంఘాల్లోను వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. 14వ తేదీన జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న రైతులు గురువారం నీటితీరువా చెల్లించేందుకు సచివాలయానికి వెళ్లారు. అక్కడ వీఆర్వో నీటితీరువా కట్టించుకుంటానని చెప్పిన కొద్దిసేపటికి ఫోన్ రావడంతో తహసీల్దార్ రమ్మన్నారని వెళ్లిపోయాడు. తర్వాత ఎంతకీ గ్రామానికి రాకపోవడంతో.. ఒక్కరోజే సమయం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. శుక్రవారం నీటితీరువా కట్టించుకోకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ నర్సింహమూర్తి వద్ద ప్రస్తావించగా వీఆర్వోను సచివాలయానికి పంపించి నీటితీరువా కట్టించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గురుబ్రహ్మకు రిమ్మ తెగులు

- విద్యార్థినులను వేధిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్
- దేహశుద్ధి చేసిన ఒక బాలిక బంధువులు
- నిందితుడిపై పోక్సో కేసు.. ఆర్జేడీ విచారణ
- గోప్యంగా ఉంచిన చోడవరం పాత పాలిటెక్నిక్ కాలేజీ వర్గాలు



అనుచిత ప్రవర్తనకు దిగిన లెక్చరర్ కనకారావు

చోడవరం రూరల్: స్థానిక పాత పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తనకు దిగిన కాంట్రాక్టు లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదైంది. బాధితురాలి బంధువుల చేతిలో దెబ్బలు తిన్న నిందితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కూడా కేసు పెట్టారు. కళాశాలల ప్రాంతీయ సంచాలకులు ఎస్.శోభారాణి గురువారం విచారణ కూడా చేశారు. అయితే ఈ విషయం ఎక్కడా బయటకు పొక్కకుండా గోప్యత పాటిస్తున్నారు. ఇక ఈ వివాదంపై ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు రెండు వర్గాలకు 41 ఎ నోటీసులు అందించి కేసులు నమోదు చేసి మిన్నకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా చేస్తున్న సూరెడ్డి కనకారావు కళాశాల విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం కొంతకాలంగా సాగుతోంది. ఒక విద్యార్థిని ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలపడంతో ఆమె కుటుంబీకులు, స్నేహితులు కలిసి లెక్చరర్ కనకారావుపై భౌతిక దాడికి దిగారు. దీంతో ఆయన చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధిత విద్యార్థినులంతా కలసి లెక్చరర్ లైంగిక వేధింపుల పట్ల పోలీసులను ఆశ్రయించారు. లెక్చరర్‌పై పోక్సో కేసుతోపాటు, అతనిపై భౌతికంగా దాడికి దిగిన వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు. గురువారం కళాశాలకు చేరుకున్న ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్ నుంచి, బాధిత విద్యార్థినుల నుంచి వాంగ్మూలాలను సేకరించినట్టు తెలిసింది. కాగా కాంట్రాక్టు లెక్చరర్ కనకారావు ప్రమోషన్ లిస్టులో ఉండడంతో అతడిని ఈ గండం నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

ఉమాశంకర్ గణేష్‌కు మాజీ సీఎం జగన్ పరామర్శ


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫోన్‌లో గురువారం పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. కోలుకుంటున్నట్లు మాజీ సీఎంకు తెలిపానని గణేష్ పేర్కొన్నారు.

మాజీ మంత్రి రోజాతో వ్యక్తిగత విభేదాల్లేవు

- టీవీ నటుడు హైపర్ ఆది



నర్సీపట్నం: మాజీ మంత్రి ఆర్.కె.రోజాతో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాల్లేవని జబర్దస్త్ నటుడు హైపర్ ఆది తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు వేరైనప్పటికీ రోజాతో విభేదాలు లేవని చెప్పారు. నర్సీపట్నంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జబర్దస్త్ నటులు హైపర్ ఆది, శాంతి స్వరూప్ వచ్చారు. ఈ సందర్భంగా ఆది మీడియాతో మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ మీద అభిమానంతో గత ఎన్నికల్లో జనసేన పార్టీకి పూర్తిస్థాయిలో పని చేశానని, ఎలాంటి పదవులు ఆశించలేదన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తురువోలు విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

చీడికాడ: రాష్ట్ర స్థాయి కౌశల్ పోస్టర్ ప్రజంటేషన్ పోటీలకు మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.రామకృష్ణారావు గురువారం తెలిపారు. ఇటీవల జిల్లాలో జరిగిన పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సుంకర ప్రసన్నకుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థితోపాటు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయిని మాధవిని హెచ్‌ఎంతో పాటు ఏపీటీఎఫ్ నేత జీపీఏ నాయుడు అభినందించారు.

- సుపరిపాలన విభాగంలో తుమ్మపాల పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు
- వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధికి బాటలు
- మూడు సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వరం ప్రభుత్వ సేవలు
- అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడంలో ముందంజ


తుమ్మపాల గ్రామం

తుమ్మపాలన సూపర్

అనకాపల్లి: అర్హులకు సంక్షేమ ఫలాలు.. రైతులకు సాగునీరు.. ప్రజలకు తాగునీరు.. భావి పౌరులకు విద్య, రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో తుమ్మపాల పంచాయతీ మేటిగా నిలిచింది. గ్రామంలో మూడు సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వరం ప్రభుత్వ సేవలు అందిస్తూ 2023–24 ఏడాదికి సుపరిపాలన అవార్డును దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ అందించే ఈ అవార్డుల్లో సుపరిపాలన విభాగంలో మొదటి స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచింది. జనవరి 26న గ్రామ ప్రజాప్రతినిధులు ఈ అవార్డును అందుకోనున్నారు. అనకాపల్లి మండలంలో మేజర్ పంచాయతీ అయిన తుమ్మపాల జనాభా 28,035. ఈ గ్రామం అనకాపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు రూ.15 కోట్ల నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు గ్రామంలో ఎక్కువ మందికి పొందేలా చేశారు.

ఇవీ ప్రత్యేకతలు

- పంచాయతీ పరిధిలో 5 ఎంపీటీసీలు, 18 మంది వార్డు మెంబర్లు ఉన్నారు.
- తుమ్మపాల కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రోగులకు నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.
- 2023–24 ఏడాదిలో రూ.కోటీ ఎంపీపీ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- వీధి రహదారులు, తాగునీటి సదుపాయం, కమ్యూనిటీ భవనాలు, కాలువలు అభివృద్ధి చేశారు.
- గ్రామంలో 2 వేల మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. మూడు సచివాలయాల పరిధిలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు.


తుమ్మపాలలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)


తుమ్మపాల సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

- గతంలో తుమ్మపాల కేంద్రంగా చెరకు ఫ్యాక్టరీ ఉండడంతో గ్రామంలో రైతులు చెరకు పంటలు పండించేవారు.
- ఫ్యాక్టరీ మూతపడడంతో చెరకుకు బదులుగా రైతులు వరి, పాడి పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు.
- శారదానది నుంచి అందే సాగునీటి ద్వారా రైతులు వరి పంట పండిస్తున్నారు.
- గ్రామంలో ప్రధానంగా మూడు పంట కాలువలు ఉన్నాయి. దీప్తి కాలువ, నడిం కాలువ, ఊర కాలువలు రైతులను ఆదుకుంటున్నాయి.
- ఇలా సుపరిపాలనలో తుమ్మపాల గ్రామం మొదటి స్థానంలో నిలవడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన సాధ్యం



సచివాలయ వ్యవస్థ కారణంగా సుపరిపాలన సాధ్యమైంది. గ్రామంలో అనేక సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ వ్యవస్థ ద్వారా అందజేశాం. రాష్ట్రంలో గ్రామానికి మొదటి స్థానం రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం.

– పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు, తుమ్మపాల గ్రామం

అవార్డుతో బాధ్యత పెరిగింది



మేజర్ పంచాయతీ అయిన మా గ్రామానికి సుపరిపాలనలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడంతో మరింత బాధ్యత పెరిగింది. గ్రామ ప్రజల సహకారంతో అవార్డు సాధించగలిగాం. అవార్డుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొంత నగదును కూడా గ్రామ అభివృద్ధికి అందిస్తుంది. ఆ నిధులు ఖర్చు చేసే సమయంలో గ్రామ సభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం.

– తట్టా పెంటయ్యనాయుడు, గ్రామ సర్పంచ్, తుమ్మపాల గ్రామం

బుచ్చింపేట పాఠశాలలో 'ప్రైవేటు' బోధన

- బయోమెట్రిక్ వేసుకుని వెళ్లిపోతున్న హెచ్‌ఎం



పాఠశాలలో బోధిస్తున్న ప్రైవేటు టీచర్, (ఇన్‌సెట్) విధులకు హాజరు కాని హెచ్‌ఎం నాగభూషణం

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ప్రైవేటు వ్యక్తి బోధించడం విస్మయానికి గురి చేస్తోంది. ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం యు.నాగభూషణం రోజూ ఉదయం 9 గంటలకు రావడం, ఆనక బయోమెట్రిక్ వేసుకుని బయటకు వెళ్లిపోతున్నారు. విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంని నిలదీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఎంఈవోకి, ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవో జానుప్రసాద్‌ను సాక్షి సంప్రదించగా, గత నెలలో అతనికి మెమో ఇచ్చామన్నారు. దీనిపై హెచ్‌ఎం తనకు, తన భార్యకు ఆరోగ్యం బాగుండడం లేదని సమాధానమివ్వగా మందలించామన్నారు. తాను ప్రైవేటు వ్యక్తితో బోధనకు అనుమతించలేదన్నారు. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించాలని ఆదేశించానన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని వివరించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎస్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. దీనివల్ల కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, ఆనందపురం, ఎల్.కొత్తూరు, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం, రామన్నపాలెం, భీమబోయిన పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆయా సమయంలో ఉండబోదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామం వద్ద గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఐదుగురు గాయపడ్డారు. అనకాపల్లి నుంచి తేగాడ వద్ద బయో కెమికల్ పరిశ్రమకు ఉద్యోగులతో వెళ్తున్న ఆటో తేగాడ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో దానిలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడగా, అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు కశింకోటకు చెందిన వాలిచర్ల వెంకటరమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

సమస్యలు తీర్చని సదస్సులెందుకు?

- వడ్డాది సభలో రైతుల ఆగ్రహం


సదస్సులో రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: రైతుల సమస్యలు పరిష్కరించనప్పుడు రెవెన్యూ సదస్సులెందుకంటూ వడ్డాది గ్రామస్తులు కన్నెర్ర చేశారు. గురువారం గ్రామంలో తహసీల్దార్ ఎం.లక్ష్మి నిర్వహించిన సదస్సులో అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జిరాయితీ భూములను ఇనాం భూములుగా రికార్డు చేశారని, ఈ కారణంగా క్రయవిక్రయాల్లో తీవ్ర అవస్థల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని వడ్డాది వేంకటేశ్వరస్వామి భూముల సర్వే నంబర్‌లో దేవదాయ భూములతో కలపి జిరాయితీ భూములను చేర్చిన కారణంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు మామూళ్లకు అలవాటు పడి రికార్డులను తారుమారు చేశారని దుయ్యబట్టారు. వడ్డాది వెంకన్న దేవదాయ భూములకు సంబంధించి ఇప్పటికీ సరైన రికార్డులు లేవని ఆరోపించారు. ఈ వ్యవహారాలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ లక్ష్మి వారికి హామీ ఇచ్చారు.

కుమారుడి ఉద్యోగం పోవడంతో గుండెపోటుతో తండ్రి మృతి


అప్పారావు (ఫైల్)

నర్సీపట్నం: కుమారుడి ఉద్యోగం పోయిందని తెలిసి ఓ తండ్రి మృతి చెందిన సంఘటన నర్సీపట్నంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నంకు చెందిన గొలుసు వెంకటేశ్వరరావు కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కొన్ని కారణాలతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ విషయం తెలియడంతో తండ్రి అప్పారావు(80) మనస్తాపానికి గురై గురువారం గుండెపోటుతో మృతి చెందారు. అయితే ఉద్యోగం పోయిన విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడికి చెప్పుకునేందుకు వెంకటేశ్వరరావు వెళ్లగా.. బంధువులు ఫోన్ చేసి మీ నాన్న చనిపోయాడని చెప్పడంతో వెనుదిరిగి వచ్చేశాడు. తన ఉద్యోగం తండ్రి ప్రాణం తీసిందని వెంకటేశ్వరరావు కంటతడి పెట్టుకున్నాడు.

టేకు దుంగల అక్రమ రవాణా


పోలీసులు పట్టుకున్న టేకు దుంగల వ్యాన్

మాకవరపాలెం: అక్రమంగా టేకు దుంగలు తరలిస్తున్న వ్యాన్ అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొండల అగ్రహారం సమీపంలోని పొలం నుంచి గురువారం సాయంత్రం బొలెరో వాహనంలో అక్రమంగా టేకు దుంగలు తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో వెంటనే పోలీసులు ఆ వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ అధికారి నూకరాజు మాట్లాడుతూ టేకు దుంగల కొలతలు సేకరించి అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడికి రిమాండ్

తుమ్మపాల: మూడు మోటార్ బైక్‌లు, బుక్ స్టోర్‌లో నగదు దొంగిలించిన ఘరానా దొంగను పట్టణ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపించారు. పట్టణ సీఐ విజయకుమార్ అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణ పరిధిలో జగన్నాథపురం గ్రామం రెల్లివీధికి చెందిన యర్రంశెట్టి నాని అలియాస్ మహేష్ (25) పలు చోరీలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. పట్టణ పరిధిలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు తన సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా, అతడ్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఇటీవల పట్టణంలో దొంగలించిన రెండు బైక్‌లను రికవరీ చేశారు. గతేడాది పట్టణంలో ఒక మోటార్ బైక్, ఉప్పల బ్రదర్స్ బుక్ స్టోర్‌లో నగదు చోరీలతోపాటు బైక్‌లు దొంగతనాలపై కాకినాడ -1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నేరస్తుడిగా ఉన్నాడని సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కిషోర్, సతీష్‌లను అభినందించారు.

36 మద్యం బాటిళ్ల స్వాధీనం

నర్సీపట్నం: అక్రమంగా తరలిస్తున్న 36 మద్యం బాటిళ్లను టౌన్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. యల్లవరం గ్రామానికి చెందిన వర్రే సురేష్ శివపురం వైన్‌షాపు నుంచి 32 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. చింతపల్లికి చెందిన కె.బోడకొండ నాలుగు మద్యం బాటిళ్లు తీసుకువెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరికీ స్టేషన్ బెయిల్ మంజూరు చేశామని సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో పేకాట స్థావరంపై ఆకస్మికంగా గురువారం సాయంత్రం దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. వీరంతా పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. రూ.15,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అక్రమ టాక్స్ వసూళ్లపై పోలీసులకు ఫిర్యాదు

- మున్సిపల్ సిబ్బంది పేరిట ప్రజలకు ఫోన్లు


మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర

నర్సీపట్నం: మున్సిపాలిటీలో అక్రమంగా టాక్స్ వసూలు చేస్తున్న అపరిచితులపై మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన అందించిన వివరాలు.. సైబర్ నేరాల తరహాలోనే అపరిచితులు కొంతమంది వ్యాపారులకు ఫోన్ చేసి.. తాము మున్సిపల్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని, టాక్స్ డబ్బులు వెంటనే ఫోన్‌పే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అపరిచితుడి మాటలు నమ్మి ఒక వ్యాపారి రూ.1600లు ఫోన్‌పే చేశారన్నారు. అపరిచితుడి ఫోన్ నంబరుకు ట్రూ కాలర్‌లో 'మున్సిపల్ కమిషనర్' అని రావడంతో కొంతమంది వ్యాపారులు నిజమని నమ్మి, సొమ్ము చెల్లించారన్నారు. తన దృష్టికి తేవడంతో అపరిచితుడి నంబరుకు ఫోన్ చేయగా.. రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయటం లేదన్నారు. వెంటనే టౌన్ సీఐ గోవిందరావును కలిసి ఫిర్యాదు చేశామన్నారు. తను కానీ తమ సిబ్బంది కానీ ఎవరికీ టాక్స్ కట్టమని ఫోన్లు చేయలేదన్నారు. సైబర్ తరహాలో కొత్త నేరానికి తెరలేపారన్నారు. టాక్స్, వ్యాపార లైసెన్సులు, లైసెన్సుల రెన్యూవల్, ఇతర టాక్స్‌లు నేరుగా కార్యాలయానికి చెల్లించి రసీదు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం


ఏలేరు కాలువలో నీరు ఉప్పొంగడంతో రాజుపేట అగ్రహారంలో తడిసిన వరి చేను


నాతవరం మండలంలో నిండుగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువలో నీరు

- నీటి ముంపులో ఏలేరు కాలువకు ఇరువైపులా ఉన్న వరి పొలాలు
- లబోదిబోమంటున్న తాండవ ఆయకట్టుదారులు
- ఏలేరు కాలువపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నాతవరం: ఏలేరు కాలువ అధికారుల నిర్లక్ష్యం తాండవ ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. గత రెండు రోజులుగా ఏలేరు కాలువు నీరు ఉప్పొంగి ప్రవహించడంతో కాలువకు ఇరువైపులా ఉన్న వరి పొలాలు నీటిలో మునిగిపోయాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు, గ్రేటర్ విశాఖ ప్రజలకు తాగునీరు అందించేందుకు సుమారుగా 154 కిలో మీటర్లు పొడవున ఏలేరు కాలువలో నీరు ప్రవహిస్తుంది. నాతవరం మండలంలో పి.జగ్గంపేట పి.కె.గూడెం, కొండ దర్శవరం, గునుపూడి, చినగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, పెదగొలుగొండపేట, మన్యపురట్ల, లింగంపేట, ఎ.పి.పురం, ఎం.బి.పట్నం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీల మీదుగా సుమారుగా 26 కిలోమీటర్లు పొడవున ఏలేరు కాలువ ద్వారా నీరు ప్రవహిస్తుంది. వాటిలో జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీలు తప్పా, మిగిలిన పంచాయతీలు పరిధిలో ఏలేరు కాలువ పంట పొలాలకు ఎత్తులో ప్రవహిస్తుంది. ఏమాత్రం ఏలేరు కాలువ ఉప్పొంగి ప్రవహించినా పంట పొలాలను ముంచెత్తుతోంది. గత వారం రోజులుగా తాండవ ఆయకట్టు పరిధిలో పండిన వరి చేనును రైతులు కోస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలేరు కాలువ అధికారులు గత రెండు రోజుల నుంచి నీటిని ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి అదనంగా విడుదల చేస్తున్నారు. దీంతో పల్లపు ప్రాంతంలో కాలువకు ఇరువైపులా ఉన్న వందలాది ఎకరాల్లో వరి చేను తడిసిపోయింది. కష్టపడి పండించిన వరి చేను కళ్ల ముందే తడిసిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఏలేరు ప్రాజెక్టు అధికారులకు కాలువపై పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఏలేరు కాలువ జేఈ గోపీనాథ్‌ను వివరణ కోరగా.. ఏలేరు కాలువలోకి నీటిని అదనంగా విడుదల చేయడం లేదని, ఈ ప్రాంతంలో ఇసుక దిమ్మలను తొలగించడంతో వరి పొల్లాలోకి నీరు చేరిందన్నారు.

కనకమ్మకు నీరాజనం



యలమంచిలిలో కనకమహాలక్ష్మి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ.. అమ్మవారికి తొలిపూజ నిర్వహించిన అనంతరం తెల్లవారుజాము 3 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. పలువురు మహిళలు అమ్మవారికి చీర, జాకెట్టు, పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొటారు సాంబ, తాటిపాకల మాణిక్యాలరావు, కొటారు సూర్యప్రకాష్ తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. సుమారు 2వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


- కశింకోటలోని కనకమహాలక్ష్మి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర మాసం రెండో గురువారం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో మహిళలతో పాటు భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు.

బంగారు పతకాలతో మెరిసిన చెట్టుపల్లి విద్యార్థులు


పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, పీడీ శ్రీదేవి

నర్సీపట్నం: ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం మండలం చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎక్విప్డ్ విభాగంలో ఎ.పూర్వజ, జె.అంకిత, జె.అక్షయ బంగారు పతకాలు సాధించారు. అన్ ఎక్విప్డ్ విభాగంలో ఎం.మణి బంగారు పతకం, ఎం.లక్ష్మీదేవి, ఎం.అమృతవల్లి రజిత పతకాలు సాధించారు. విజేతలు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డి.దినేష్ చేతుల మీదగా పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులు, పీడీ శ్రీదేవిని పాఠశాల హెచ్‌ఎం పి.వి. రామకృష్ణారావు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

దీక్షాధారులతో పులకించిన సింహగిరి


దీక్ష తీసుకున్న దీక్షాధారులు

- 32 రోజుల నృసింహ దీక్షల స్వీకరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన దీక్షాధారులు


తులసిమాలలతో దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: నృసింహ దీక్షాధారులతో సింహగిరి పులకించింది. ఈ నెల 2వ తేదీన 41 రోజులపాటు దీక్షలు ప్రారంభం కాగా..గురువారంమరికొందరు భక్తులు 32 రోజుల పాటు దీక్ష ధరించారు. సింహగిరికి వచ్చిన సుమారు ఎనిమిదివందల దీక్షాధారులకు ఉదయం సింహాచలం దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమను ఉంచారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోశ్ఛరణల మధ్య ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. దీక్షానియమాలను వివరించారు. స్వామివారి తులసి మాలలను, ప్రతిమలను ఉచితంగా అందజేశారు. స్వామివారి దర్శనాన్ని ఉచితంగా కల్పించారు. అన్నప్రసాద భవనంలో దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఉప ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు పాల్గొన్నారు. ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. జనవరి 12వ తేదీన దీక్షవిరమణ ఉంటుందని దేవస్థానం ఈవో ప్రకటించారు. ఆరోజు దీక్షా విరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు నేత్ర పరీక్షలు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉచిత నేత్ర పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు పూసర్ల రాజా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి పరీక్షలు అనంతరం ఆపరేషన్లకు ఎంపికైన రోగులకు ఉచితంగా చేయిస్తామన్నారు.

టెన్త్ మెటీరియల్ పంపిణీ



కన్నూరుపాలెంలో టెన్త్ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో అప్పారావునాయుడు

కశింకోట: టెన్త్ క్లాస్ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. మండలంలోని కొత్తపల్లి, కన్నూరుపాలెం, బయ్యవరం జిల్లా పరిషత్ హైస్కూళ్లను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ మెటీరియల్ పుస్తకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్త్ క్లాస్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి అనువుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించామన్నారు. అనంతరం వీటిని కావలసిన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి కిట్టు, హెచ్‌ఎం శేఖర్, కన్నూరుపాలెం ఇన్‌చార్జి హెచ్‌ఎం శేషారత్నం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ సిబ్బంది

పరవాడ: జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీ, భోపాల్‌లో ఈ నెల 13 నుంచి జనవరి 5 వరకు నిర్వహించనున్న 67వ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.సురేంద్ర, సాయిరవి, వి.భాను, పి.అక్షయ్‌లు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ రామ్మోహనరావు గురువారం మీడియాకు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 2,997 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	5,300
మొదటి రకం	3,520	4,160
రెండో రకం	3,150	3,800
మూడోరకం	2,840	3,140

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరన్	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
దేవర	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 378 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- అనకాపల్లి -విశాఖ హైవేలో నిలుస్తున్న మురుగు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామాలైన కొప్పాక, కొత్తూరు, సిరసపల్లి, మారేడుపూడిలో కనీస మౌలిక సదుపాయాలు కానరాలేదు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడటంతో జాతీయ రహదారి ఆనుకుని కలెక్టర్ కార్యాలయాన్ని, విలీన గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్, రవాణా, విద్యా శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు పై గ్రామాల్లో నివసిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇళ్లలో వాడుకనీరంతా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడంతో జీవీఎంసీ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని కనీస మౌలిక సదుపాయాలు

కొప్పాక, కొత్తూరు, సిరసపల్లి, మారేడుపూడి గ్రామాల్లో ప్రజలు జాతీయ రహదారికి ఇరువైపులా నివసిస్తున్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా గృహాల్లో వాడుక నీరు దిగువ స్థాయిలో పారేందుకు సరైన మురుగు కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద డ్రైనేజీ నీరు జాతీయ రహదారిపై చేరడంతో జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు కొప్పాక – ఏలేరు కాలువలోకి పంపిస్తున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ఏలేరు కాలువ నీరు డ్రైనేజీ వ్యవస్థ ద్వారా రహదారిపైకి చేరుతోంది.



కొత్తూరు జాతీయ రహదారి పక్కన పూడ్చివేసిన డ్రైనేజీ

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ..

కొత్తూరు నుంచి సిరసపల్లి అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కొత్తూరు గ్రామీణ వికాస్ బ్యాంక్ సమీపంలో స్థానిక వ్యాపారులు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మూసివేసి, లారీల రిపేరింగ్‌కు అనుకూలంగా చేసుకోవడంతో ఇక్కడ డ్రైనేజ్ రహదారిపై చేరుతోంది.

డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి



జీవీఎంసీ విలీన గ్రామాల్లో గృహాలు సంఖ్య పెరిగిపోతోంది. డ్రైనేజీ, రహదారి వ్యవస్థను పూర్తి స్థాయిలో బాగు చేయాలి. జాతీయ రహదారి పక్కన సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గృహాల్లో వాడుక నీరు రహదారిపైకి వస్తోంది. వర్షాకాలంలో సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.

– సి.సత్తిబాబు, కొప్పాక గ్రామం, అనకాపల్లి మండలం

రోడ్డుపై మురుగు నీరు



కొప్పాక – ఏలేరు కాలువ నుంచి మారేడుపూడి జంక్షన్ వరకూ అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే మార్గంలో దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో డ్రైనేజీ వ్యవస్థను పూడ్చి వేశారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లలో వాడుక నీరు రహదారిపై పారుతోంది. వర్షాలు పడే సమయంలో కొప్పాక, కొత్తూరు ఇండస్ట్రియల్ ఏరియా, మారేడుపూడి జంక్షన్ల వద్ద మురుగునీరు జాతీయ రహదారిపై నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే డ్రైనేజీ పనులు చేపట్టాలి.

– పి.శ్రీను, సిరసపల్లి, అనకాపల్లి మండలం

కనకమహాలక్ష్మి నమోస్తుతే..

భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయం



కనక మహాలక్ష్మికి పూజలు చేస్తున్న అర్చకులు



బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటూ...

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర మాసం రెండో గురువారం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో మహిళలతోపాటు భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరా సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని ఆభరణాలు, నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. లక్ష్మి అష్టోత్తరంతో కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం ఎదుట బయట ఉన్న అమ్మవారిని కొబ్బరి నీళ్లతో అభిషేకించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ, ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీశెట్టి కుమార్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో మహిళలతో భజన కార్యక్రమం జరిగింది. భక్తి పాటలు పాడి భక్తులను మంత్రముగ్ధుల్ని చేశారు. కమిటీ ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, మాజీ వార్డు సభ్యురాలు సూరిశెట్టి రేవతి తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం



ఆలయం బయట అమ్మవారి విగ్రహానికి భక్తుల పూజలు

లేగ దూడల ప్రదర్శన



అచ్చెర్లలో లేగ దూడల ప్రదర్శన

కశింకోట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అచ్చెర్ల గ్రామంలో గురువారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు 75 లేగ దూడలను తీసుకువచ్చి ప్రదర్శించారు. వీటిలో ఉత్తమ లేగ దూడల పెంపకం రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామమోహన్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదకు వచ్చిన పశువులకు ఎస్ఎస్ఎస్ వీర్యం ఇవ్వడం వల్ల ఆడ దూడలు పుడతాయని, దీనివల్ల పాడి రైతులు ఆర్థికంగా బలపడటానికి అవకాశం ఉంటుందన్నారు. ఇది పశువులు ఆస్పత్రుల్లో లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. పశు సంవర్ధక శాఖ అనకాపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ సౌజన్య, పశు వైద్యాధికారులు అల్వానా జార్జి, చైతన్య, సౌజన్య, స్థానిక నాయకులు నైనంశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సన్యాసినాయుడు, గుడబండ జాని, భీమవరపు శ్రీను, లేగ దూడలకు బహుమతులు పొందిన పాడి రైతులు సందిన అప్పారావు, దొడ్డి రామునాయుడు, నిమ్మదల నాగేశ్వరరావు, బండారు నాయుడు, ఇతర రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజేత రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జిల్లా అధికారి డాక్టర్ రామమోహన్

తగ్గిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త తగ్గాయి. టమాటా గత వారం కంటే కిలోకి రూ.20 తగ్గింది. గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.30కి అమ్మకాలు సాగాయి. అయితే ఉల్లి రూ.50 వద్ద బెట్టు మీద ఉంది. బంగాళాదుంప, వంకాయ, దొండకాయ రూ.40, బెండకాయ, చిక్కుడు కాయ రూ.60, క్యారెట్, అల్లం రూ.80కి విక్రయాలు సాగాయి. గోబీపువ్వు పరిమాణం అనుసరించి రూ.20 నుంచి రూ.40 వరకు విక్రయించారు.

బాల్యవివాహాలు నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

నర్సీపట్నం: బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాకవరపాలెం ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. మాకవరపాలెం మండలానికి సంబంధించి కిశోరి వికాసంపై శిక్షణను ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇలాంటి వివాహాలతో మైనర్లు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను కోల్పోతారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందన్నారు. అనంతరం సీడీపీవో మేరీ సువార్త మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎవరు ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులకు ఈ విషయంపై సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అధికారులు లక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీ కల్పించాలి

మాడుగుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) బస్సు సర్వీసులకు సంబంధించి, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో దివ్యాంగులకు రాయితీ కల్పించాలని దివ్యాంగులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఈ బస్సు సర్వీసుల్లో 50 శాతం రాయితీ ఉండేది. సుమారు ఎడాది కాలం నుంచి ఈ రాయితీని రద్దు చేశారని, ఈ బస్సు సర్వీసుల్లో దివ్యాంగులు పూర్తి స్థాయి టిక్కెట్టును కొనుగోలు చేసి ప్రయాణం చేయడం తప్పడం లేదని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, లగ్జరీ తదితర సర్వీసులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్న ఆర్టీసీ ఒక మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ఎందుకు అనుమతించడం లేదని దివ్యాంగులు ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. వెంటనే మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రాయితీ పునరుద్ధరించాలని దివ్యాంగులు కోరుతున్నారు. ఇటీవల ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం



చింతలపాలెంలో వైద్య శిబిరం



సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్‌లకు సత్కారం

కశింకోట: ఎప్పుడు అవసరం వచ్చినా దివ్యాంగులకు అండగా ఉంటామని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చింతలపాలెంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మనీషా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణరావు, అతిథులు సీఐ, ఎస్ఐలను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. అన్న సమారాధన నిర్వహించారు. రెహమాన్‌ను కూడా దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జెర్రిపోతుల నూకినాయుడు, మరపురెడ్డి గిరిబాబు, షేక్ బాబూరావు, సత్యం, రాజుబాబు, పప్పల గోవింద, ఎంఎల్‌హెచ్‌పీ కె. కల్యాణి, ఏఎన్ఎం భవాని, తదితరులు పాల్గొన్నారు.

పద్మారావు మృతి నాటక రంగానికి తీరని లోటు

మునగపాక: కళా రంగానికే వన్నె తెచ్చిన రంగస్థల నటుడు పద్మారావు మృతి బాధాకరమని మునగపాక మాజీ సర్పంచ్ టెక్కలి రమణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాక సంతబయిలకు చెందిన రంగ స్థల నటుడు విల్లూరి పద్మారావు సంతాప సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పద్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమణబాబు మాట్లాడుతూ పద్మారావు పలు నాటికలు, నాటకాల్లో ప్రదర్శనలతో ప్రతిభ కనబరిచారన్నారు. పద్మారావు మృతి నాటకరంగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆడారి రాజు, వేగి రామకృష్ణ, శరగడం గణేష్, కాండ్రేగుల మణికంఠ, ఆడారి గోవింద, శరగడం జగన్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల నటుడు పద్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునగపాక వాసులు

రైతులను మోసగించిన చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ధ్వజం

నర్సీపట్నం : రైతులను సీఎం చంద్రబాబు మరోసారి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. రైతాంగానికి నష్టం కలిగేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13 కలెక్టరేట్ వద్ద అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులకు మొండి చేయి చూపారన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్లు రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున రైతులకు అందించి రైతులను ఆదుకున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ఉద్యమ బాట పట్టిందన్నారు. 2014 ఎన్నికల ముందు తెలుగుదేశం అధికారంలోకి వస్తే రైతు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెబితే చంద్రబాబును గెలిపించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రుణాలు కాదు పంట రుణాలని మాట మార్చారన్నారు. మళ్లీ పంట రుణాలు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అని చెప్పి ఇంట్లో ఒకరికి మాత్రమే మాఫీ చేస్తామని రైతులను మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు గణమ్మ, సుర్ల శేఖర్, శానపతి వెంకటరత్నం, రుత్తల సర్వేశ్వరరావు, బయపుడ్డి గణమ్మ, చోటీ, కణితి అన్నపూర్ణ, తమరాన శ్రీను పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో ప్రజలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : ప్రభుత్వ లక్ష్యాల మేరకు గ్రామాల్లో అభివృద్ధికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అభివృద్ధిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల వద్ద గురువారం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ కార్యక్రమంపై సర్పంచ్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అప్పలరాజు మాట్లాడుతు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది, సురక్షిత మంచినీటిని, పారిశుధ్య సమస్య లేకుండా చర్యలను చేపట్టడంలో ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామంలో అభివృద్ధి పనుల ద్వారా మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ రాజ్, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళా ఆర్థికాభివృద్ధి, ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం ప్రభుత్వాలు అందించడం జరుగుతుందన్నారు. ఎల్ఎస్‌డీజీఎస్ గోల్స్ ద్వారా అందించే ప్రాధాన్యతాంశాలను సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందించే కార్యక్రమంలో పెద్దపీటను వేయాల్సిందిగా ఎంపీడీవో అప్పలరాజు సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణి, మండల ఇంజనీర్ సుమతి, ఐకేపీ ఏపీఎం.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్‌డీజీఎస్ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

మాడుగుల రూరల్ : మండలంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఎంపీపీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో కె.అప్పారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎల్ఎస్‌డిజిఎస్ పై ఈ నెల 16, 17, తేదీల్లో ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, సాగరం, డి.గొటివాడ, ముకుందపురం, వంటర్లపాలెం, తాటిపర్తి, వీరనారాయణం, జంపెన, సత్యవరం, జె.డి.పేట, గాదిరాయి, ఎల్.పొన్నవోలు, శంకరం, గ్రామాలకు చెందిన పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో శిక్షణ జరుగుతుందన్నారు. 18, 19, తేదీల్లో ఎం.కోడూరు, కె.జె.పురం, వి.వి.అగ్రహారం, జి.అగ్రహారం, చింతలూరు, అవురువాడ, పొంగలిపాక, కింతలి, కె.వల్లాపురం, ఒమ్మలి, వీజేపురం, ఎం. కృష్ణాపురం, జాలంపల్లి, పి.పి. అగ్రహారం, మాడుగుల గ్రామాలకు చెందిన వారితో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పాల్గొని మహిళలకు సరుకులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులకు నృసింహ దీక్ష వస్త్రాల పంపిణీ



లోతేరు వేణుగోపాలస్వామి ఆలయంలో గిరిజనులకు దీక్ష వస్త్రాలు అందిస్తున్న సింహాద్రి మఠం గురుస్వామి సురేంద్ర

సింహాచలం: ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం 32 రోజుల శ్రీనృసింహ దీక్షలు తీసుకున్న గిరిజన దీక్షాధారులకు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర దీక్ష వస్త్రాలు అందించారు. అరకులోని లోతేరు రోడ్డులో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం, ముంచంగిపుట్ రామాలయం, జీకే వీధి మండలం ఏబులంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం, చింతపల్లి మండలం బొంగూడ గ్రామంలోని ఆలయంలో దీక్షలు తీసుకున్న సుమారు 650 మంది గిరిజనులకు ఈ వస్త్రాలను ఉచితంగా అందించారు. పురుషులకు పంచె, కండువా, చొక్కా పీస్, మహిళలకు చీర, కండువా ఇచ్చారు.